ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక




రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్
## థియేటర్లు అన్నీ బంద్
### ఈ కఠిన నిర్ణయం ఎందుకంటే

హైదరాబాద్, మే 15 (ప్రభాత ఉదయం): ఇన్నిరోజులు ఓ బాధ ఇప్పుడు ఇంకో బాధ. కరోనా నుంచి కుదుటపడ్డాం అనుకునే లోపే.. థియేటర్లపై ఎలక్షన్ పిడుగు పడింది. తెలంగాణ ఎన్నికల దగ్గర్నుంచి.. ఇప్పటివరకు చిన్న థియేటర్ చినబోతోంది. సింగిల్ స్క్రీన్‌కు వెళ్లేవారు తగ్గిపోతున్నారు. రీ రిలీజ్‌లతో జోష్ వచ్చినా.. ఇప్పుడు అవీ బోర్ కొట్టేస్తున్నాయి. దీంతో థియేటర్‌కు వచ్చేవారు ..మిగతా 2లో


సంపుటి: 2 | సంచిక: 36 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 16 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్





## జూన్ 2 తర్వాత ఆ ఆస్తులు మనకే సొంతం
### ఏపీకి సంబంధం లేదు రేవంత్ రెడ్డి రివ్యూ

హైదరాబాద్, మే 15 (ప్రభాత ఉదయం): ఏపీ, తెలంగాణ మధ్య అపరిష్కృత అంశాలపై రేవంత్ రెడ్డి ఫోకస్ చేశారు. ఈ నెల 18వ తేదీన శనివారం రాష్ట్ర కేబినెట్ సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూన్ 2వ తేదీ నాటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పునర్విభజనకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. రాష్ట్ర విభజన అనంతరం ఉద్యోగుల కేటాయింపు మొదలుకొని ఆస్తులు, అప్పుల పంపిణీకి సంబంధించిన పెండింగ్ అంశాలపై నివేదిక తయారు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. బుధవారం (మే 15) మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. షెడ్యూలు 9, షెడ్యూలు 10 లో ఉన్న సంస్థలు, కార్పొరేషన్లకు సంబంధించిన పంపిణీ ఇంకా పూర్తి కాలేదు. పలు అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. విద్యుత్తు సంస్థల బకాయిలు ఇంకా తేలలేదు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు చేసిన ప్రయత్నాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. రెండు రాష్ట్రాలు సామరస్యంగా పరిష్కరించుకునేందుకు వీలున్న ఉద్యోగుల బదిలీల వంటి అంశాలు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిరిన వాటిని పరిష్కరించుకోవాలని, పీటముడి పడిన అంశాలపై తెలంగాణ ప్రయోజనాలను కాపాడేలా తదుపరి కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు.

**ఇక ఆ భవనాలు తెలంగాణ ఆధీనంలోకి - రేవంత్**

పదేండ్లు పూర్తి కానుండటంతో పునర్విభజన చట్టం ప్రకారం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ కేవలం తెలంగాణ ..మిగతా 2లో

### బీఆర్ఎస్.. కాంగ్రెస్ మధ్య
# కరెంట్ లొల్లి
## రేవంత్ వర్సెస్ హరీశ్
### ఉద్యోగులపై నెపం నెట్టడం దారుణం
### సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు



హైదరాబాద్, మే 15 (ప్రభాత ఉదయం): తెలంగాణలో మళ్లీ కరెంట్ కోతల పంచాయితీ మొదలైంది. పవర్ కట్‌లకు హరీశ్ రావే కారణ మని ఆరోపించారు సీఎం రేవంత్. ఈ కామెంట్ల కు గులాబీ పార్టీ నుంచి గట్టిగానే కౌంటర్లు వచ్చాయి. ఆ డీటేల్స్ తెలుసుకుందాం పదండి... తెలంగాణలో అధికార, విపక్షాల మధ్య కరెంట్ వార్ నడుస్తోంది. రాష్ట్రంలోని విద్యుత్ కోతలకు బీఆర్ఎస్సే కారణమని సీఎం రేవంత్ మండిపడ్డా రు. విద్యుత్ శాఖలో కొందరు కావాలనే పవర్ కట్ చేస్తున్నారని అందుకే కొన్నిచోట్ల కోతలు తలెత్తున్నాయన్నారు రేవంత్ రెడ్డి. మాజీమంత్రి హరీశ్‌రావు కొందరితో ఇలాంటి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ గట్టిగా కౌంటర్ ఇచ్చింది. రేవంత్ రెడ్డి తన అసమర్థతను, చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు విద్యుత్ సంస్థ ఉద్యోగులను నిందిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థ ఉద్యోగుల కష్టం అద్భుతంగా ఉంది కాబట్టే అక్కడి నుంచి ఇక్కడిదాకా వచ్చామన్నారు. పదేళ్లు కేసీఆర్ ప్రభుత్వంలో కరెంటు కోతలు లేవన్న కేటీఆర్.. విద్యుత్ ఉద్యోగులను నిందిస్తూ సీఎం రేవంత్ చిల్లర రాజకీయాలకు పాల్పడతున్నారని విమర్శించారు. మరోవైపు తెలంగాణ విద్యుత్ ఉద్యోగులపై సీఎం రేవంత్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎక్స్ వేదికగా ఖండించారు మాజీమంత్రి హరీశ్ రావు. కరెంట్ కోతల విషయంలో సిఎం రేవంత్ తన ప్రభుత్వ వైఫల్యాలను అంగీకరించకుండా ప్రతిపక్షాలు, విద్యుత్ ఉద్యోగుల ..మిగతా 2లో



## ఓటు బ్యాంక్ రాజకీయాలకు నేను దూరం
### అధిక సంతానం ఉన్నవారంటే పేదలే
### అది ఓ వర్గానికే అంటగట్టడం తగదు
### ప్రధాని మోడీ స్పష్టీకరణ

వారణాసి, మే 15 (ప్రభాత ఉదయం): తానెప్పుడూ ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడలేదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. నేను ఓటు బ్యాంకు రాజకీయాలు చేయను. సబ్‌కా సాథ్-సబ్‌కా వికాస్‌ను బలంగా నమ్ముతాను. నా మాటలపై జరిగిన దుష్ప్రచారం చూసి షాక్ అయ్యానని అన్నారు. తన వ్యాఖ్యలు పేదవారి అవస్థల గురించి మాత్రమేనని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. తన వ్యాఖ్యలను ముస్లిం సమాజం గురించి అంటూ వక్రీకరించి జరిపిన దుష్ప్రచారం చేయడంపై ఆశ్చర్యపోయానన్నారు. చిన్నప్పుడు తమ ఇంట్లో ఈద్ పండగను కూడా నిర్వహించేవారమని ఓ న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. ఎక్కువమంది పిల్లలు గురించి మాట్లాడినప్పుడు అది ముస్లింల గురించి అని ఎవరు చెప్పారని అన్నారు. పేద కుటుంబాల్లోనూ ఇదే పరిస్థితి. కొన్ని కుటుంబాల్లో వారి సామాజిక పరిస్థితితో సంబంధం లేకుండా అధిక సంతానం ఉంది. అది ఏ వర్గం అని నేను ప్రస్తావించలేదు. చూసుకో గలిగినంతమంది సంతానాన్నే కనాలి కానీ..వారిని ప్రభుత్వం చూసుకునే పరిస్థితి ఉండకూడదని మాత్రమే చెప్పాను అంటూ మోదీ స్పష్టత ఇచ్చారు. 2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో అల్లర్లు జరిగినప్పుడు మోదీ ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. తన ప్రత్యర్థులు ముస్లిం వర్గంలో తన ప్రతిష్ఠను దెబ్బతీశారని దుయ్యబట్టారు. 'చిన్నప్పుడు మా ఇంటి చుట్టుపక్కల ఎన్నో ముస్లిం కుటుంబాలు ఉండేవి. మా ఇంట్లో కూడా మిగతా ..మిగతా 2లో

## హైదరాబాద్‌లో బాహాటంగా రిగ్గింగ్
### రీ పోలింగ్ జరపాల్సిందే
### బిజెపి అభ్యర్థి మాధవీలత డిమాండ్

హైదరాబాద్, మే 15 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంఐఎం నేతలు అక్రమ రిగ్గింగ్ కు పాల్పడ్డారని హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీ లత ఆరోపించారు. రిగ్గింగ్‌తో గెలవాలనుకోవడం కూడా ఓ గెలుపేనా అని విమర్శలు సంధించారు. బుధవారంఆమె మీడియాతో మాట్లాడుతూ.. రిగ్గింగ్ చేసి గెలిచే గెలుపు కూడా ఒక గెలుపేనా అని విమర్శించారు. 16 సంవత్సరాల ముస్లిం బాలిక రెండుసార్లు ఓటు వేయడానికి వచ్చి దొరికిందని, ఆ బాలిక పై కేసు నమోదు చేయకుండా తల్లితండ్రులకు అప్పగించి పంపించారని ఆమె ఆరోపించారు. రిగ్గింగ్ ఆపడానికి వెళ్లిన నాపై వేల మంది రౌడి మూకలు దాడికి యత్నించారని, రిగ్గింగ్ జరుగుతున్నా అక్కడ ఉన్న పోలీసులు స్పందించలేదని ..మిగతా 2లో






2

## కారులో మంటలు చెలరేగి దంపతుల మృతి



## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ట్రయల్ రన్ విజయవంతం

యాదాద్రి, మే 15 (ప్రభాత ఉదయం): యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అధికారులు రెండు యూనిట్లకు విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించారు. ప్లాంట్‌కు అవసరమైన మెటీరియల్ సరఫరా, రైల్వే, రోడ్డు రవాణా వ్యవస్థలను త్వరగా అందుబాటు లోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైతే ప్రత్యేక పాలసీ తీసుకునేందుకు సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఉన్న రెండు యూనిట్లకు సంబంధించిన యాక్సిలరీ బాయిలర్లను లైట్ అప్ చేశారు. దీంతో యాదాద్రి ప్లాంట్ పవర్ జనరేషన్‌లో చారిత్రక ఘట్టం మొదలైంది. దశల వారీగా పవర్ జనరేషన్ చేపట్టి త్వరలో గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. ఇటీవలే యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతిచ్చింది. దీంతో జెన్ కో విద్యుత్ ఉత్పత్తికి సన్నాహాలు చేసింది. దీనిలో భాగంగా మొదటి విడతగా 800 మెగావాట్లను ఉత్పత్తి చేసే రెండు యూనిట్లతో 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ రెండు యూనిట్లకు సంబంధించిన యాక్సిలరీ బాయిలర్లను లైట్ అప్ చేశారు. ఆ తర్వాత రెండో విడతలో మరో 800 మెగావాట్ల మూడు యూనిట్లతో 24,00 మెగా వాట్లు ఉత్పత్తి చేయనున్నారు. మొత్తంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి 4,000 మెగావాట్ల కెపాసిటీతో యాదాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటైంది. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వైటీపీఎస్ పనుల పురోగతిని పరిశీలించిన విషయం తెలిసిందే. వైటీపీఎస్‌లో ముగ్గురు మంత్రులు ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు కీలక ..మిగతా 2లో

## తెలంగాణలో క్రమేపీ చల్లబడుతోన్న వాతావరణం



### వచ్చే 3 రోజులు వానలు కురిసే అవకాశం..
### పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్.!

**హైదరాబాద్, మే 15 (ప్రభాత ఉదయం): తెలంగాణలో వాతావరణం క్రమేపీ చల్లబడుతోంది. ఎండల తీవ్రత తగ్గింది. కొన్ని ప్రాంతాల్లో 47 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు.. ప్రస్తుతం 40 డిగ్రీలకు పడిపోయింది. దీనికి కారణంగా ఉపరితల ఆవర్తనమే అని అంటున్నారు వాతావరణ శాఖ అధికారులు. మహారాష్ట్రలోని పశ్చిమ విదర్భ పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో అవర్తనం ఏర్పడిందని.. దీని కారణంగా** ..మిగతా 2లో



## జూన్ 2 తర్వాత ఆ ఆస్తులు మనకే సొంతం

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్ర రాజధానిగా మారనుంది. ఈ పదేండ్ల కాలానికి ఏపీకి కేటాయించిన లేక్ వ్యూ గెస్ట్ హౌజ్ వంటి భవనాలను జూన్ 2 తర్వాత రాష్ట్ర అధీనంలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పునర్విభజన చట్ట ప్రకారం పెండింగ్ లో ఉన్న అంశాలు, ఇప్పటి వరకు రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయంతో పంపిణీ చేసుకున్న వివరాలపై సమగ్రమైన నివేదికను తయారు చేయాలని ఆదేశించారు.

### ఈనెల 18న కేబినెట్ భేటీ

ఈ నెల 18వ తేదీన శనివారం రాష్ట్ర కేబినేట్ సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అందులో రాష్ట్ర పునర్విభజన చట్టంలో పెండింగ్లో ఉన్న అంశాలు, ఏపీతో పీటముడిగా ఉన్న అంశాలను చర్చించనున్నారు. వీటితో పాటు రైతుల రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై చర్చించనున్నారు. రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల ప్రక్రియ ముగియటంతో ముఖ్యమంత్రి ప్రజా పాలనపై దృష్టి కేంద్రీకరించారు.

## తెలంగాణలో క్రమేపీ చల్లబడుతోన్న వాతావరణం



హైదరాబాద్, మే 15 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు, 30-40 కిమీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది.గురువారం.. ఉరుములు, మెరుపులు, 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. అలాగే ఉరుములు, మెరుపులు, 30-40 కిమీ వేగంతో కూడిన వర్షాలు తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధిపేట, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. శుక్రవారం.. ఉరుములు, మెరుపులు, 30-40 కిమీ వేగంతో కూడిన వర్షాలు తెలంగాణ రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూలు జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. గత ఏడాదిలా కాకుండా ఈసారి తెలుగు రాష్ట్రాలను గట్టిగా పలకరిస్తామంటున్నాయి నైరుతి రుతుపవనాలు. విపరీతమైన ఎండలు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది ముందుగానే నైరుతి పలకరిస్తుందంటోంది. ఈనెల 19వ తేదీన అండమాన్ నికోబార్ దీవులను నైరుతి రుతు పవనాలు తాకుతాయి. ఆ తర్వాత కేరళను పలకరించి.. తెలుగు రాష్ట్రాలకు చల్లని మబ్బులు దూసుకొస్తాయి. గత ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయిన నేపథ్యంలో.. ఈసారి రుతు పవనాలు ఎలా ఉండబోతున్నాయి? వర్షాలు సమృద్ధిగా పడతాయా? సాధారణంగా ఉంటాయా? ఇప్పుడు ఇదే ఉత్కంఠ రేపుతోంది. అయితే ఈసారి వర్షపాతం బాగా నమోదవుతుందని చెబుతోంది వాతావరణ శాఖ. ఎల్ నినో ప్రభావం తగ్గి, లా నినో ప్రభావం రాబోతుండడం దీనికి దోహదం చేస్తుందంటున్నారు అధికారులు. ప్రస్తుత పరిస్థితులను బట్టి ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తాయని ఇప్పటికే ఐఎండీ అంచనా వేసింది. రుతుపవనాలు ఆశాజనకంగా ఉంటాయని, వర్షాలు కురిసేందుకు అనువైన వాతావరణం ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ ఏడాది ప్రస్తుతానికి అనుకూల పరిస్థితులే ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తొలకరి పలకరింపు కోసం తెలుగు రాష్ట్రాలు తెగ ఎదురు చూస్తున్నాయి.



## బీఆర్ఎస్.. కాంగ్రెస్ మధ్య కరెంట్ లొల్లి

మొదటి పేజీ తరువాయి...

మీద అభాండాలు మోపడాన్ని ఖండించారు. విద్యుత్ రంగ వైఫల్యాలకు తానే బాధ్యుడిని అన్నట్టుగా మాట్లాడటం విడ్డూరంగా ఉందని.. రేవంత్ వైఖరి ఆడ రాక పాత గజ్జెలు అనే సామెతను గుర్తు చేస్తోందన్నారు. కరెంట్ కోతలకు బీఆర్ఎస్సే కారణమని సీఎం రేవంత్ రెడ్డి కామెంట్ చేయడం.. దానికి గులాబీ పార్టీ నుంచి కూడా అదే స్థాయిలో రియాక్షన్ రావడంతో.. ఈ అంశంపై రాబోయే రోజుల్లో మరింత రచ్చ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు అన్నీ బంద్

మొదటి పేజీ తరువాయి...

క్రమంగా తగ్గుముఖం పడుతున్నారు. ఎలక్షన్లతోపాటు.. ఐపీఎల్ ఎంటర్టైన్మెంట్ కూడా తోడవ్వడంతో తెలుగు నిర్మాతలు తమ లను రిలీజ్ చేయడానికి జంకుతున్నారు. సమ్మర్ అకేషన్‌ను క్యాష్ చేసుకుందామనుకున్న వారు కూడా లు వాయిదా వేసుకున్నారు. దీంతో థియేటర్‌కు ప్రేక్షకుడు వచ్చే చాన్స్ లేకుండా పోయింది. చిన్నా చితకా లు వచ్చినా.. ఒకరోజు ఆడడం కూడా గగనమైంది. ఒక్కో థియేటర్‌కు రోజుకు 12వేల రూపాయల నుంచి 18వేల వరకు ఖర్చు అవుతుంది. ఇందులో పదిశాతం కూడా రావడం లేదంటున్నారు థియేటర్ యజమానులు. చేసేదేంలేక థియేటర్లను మూసేయడమే తమదగ్గరున్న ఏకైక ఆప్షన్ అని చెబుతున్నారు. చిన్న లు వస్తున్నా థియేటర్ ఆక్యుపెన్సీ పడిపోవడంతో ఎగ్జిబిటర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఓవైపు ఎండలు, ఇంకో ఎలక్షన్లు, ఐపీఎల్ ప్రభావంతో లు విడుదల చేయడంలేదు నిర్మాతలు. పెరిగిపోతున్న ఖర్చులు కూడా కారణం కావొచ్చు. ఇక చిన్నా చితక లు, డబ్బింగ్ మూవీస్‌ని మల్టీప్లెక్సుల్లోనే చూస్తున్నారు జనం. దీంతో సింగిల్ స్క్రీన్ థియేటర్‌ను మూసేయక తప్పడంలేదు. ఎలక్షన్ కోడ్ తర్వాత టిల్లు స్క్వేర్, ఫ్యామిలీ స్టార్ లు వచ్చాయి. ఒకటి హిట్టు ఇంకోటి యావరేజ్. వీటి తర్వాత మరో పెద్ద విడుదల కాలేదు. మేనెల అయినా.. ప్రేక్షకులు చూసేందుకు రెడీగా ఉన్నా.. నిర్మాతలు లు విడుదల చేసేందుకు ఆసక్తి చూపలేదు. మల్టీప్లెక్స్ కల్చర్ ఎక్కువైపోయింది. వీకెండ్స్‌లో ఫ్యామిలీస్ కోసం మంచి ఆప్షన్. వీక్‌డేస్‌లో యువత అక్కడివే వెళ్తున్నారు. మల్టీప్లెక్స్‌కు వెళ్తే.. మల్టిపుల్ ఆప్షన్స్. నాలుగైదు లు ఆడుతుంటే తమకు నచ్చినదానికి వెళ్తారు. దీంతో సింగిల్ స్క్రీన్‌కు ఆదరణ తగ్గింది. ఇక ఓటీటీల ప్రభంజనం కూడా అంతే స్థాయిలో ఉంది. విడుదలైన మూడు నాలుగు వారాలకే ఓటీటీలోకి వస్తుండడం వల్ల థియేటర్‌కు వెళ్లాలన్న ఆసక్తి కూడా తగ్గిపోయి.. మూతబడే వరకు పరిస్థితి వెళ్లింది. ఈ శుక్రవారం నుంచి కనీసం పదిరోజుల వరకు మూసేయాలని నిర్ణయించారు. అయితే ఎప్పుడు తెరుస్తారనేది తర్వాత డిసైడ్ చేయనున్నారు. ఎన్నికలు, ఎండల ప్రభావమే కాదు.. ఐపీఎల్ ఎఫెక్ట్ కూడా థియేటర్లపై భారీగానే పడినట్లు తెలుస్తోంది. ఇక థియేటర్ల టికెట్ ఖర్చుకూడా పెరగడంతో ప్రేక్షకుల ఆదరణ తగ్గిందంటున్నారు సినీ ప్రముఖులు.

## హైదరాబాద్‌లో బాహాటంగా రిగ్గింగ్

మొదటి పేజీ తరువాయి...

మాధవీ లత మండిపడ్డారు. ఇది భారత దేశమేనా.. ఇక్కడ 144 సేక్షన్ ఉండదా..? అని ఆమె ప్రశ్నించారు. ఈ రిగ్గింగ్ పై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని, అవసరమైతే రీ పోలింగ్ పెట్టడానికి ఎంత దూరమైనా వెళ్ళడానికి సిద్ధమని ఆమె వెల్లడించారు. రేపు ముంబైలో ప్రచారానికి వెళ్ళాలని పార్టీ ఆదేశించిందని అక్కడికి వెళ్తున్నట్లు తెలిపారు. ఇదిలాఉంటే.. పోలింగ్ రోజు హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని వివిధ పోలింగ్ బూత్‌ల్లో పర్యటించిన మాధవీలత.. రిగ్గింగ్ జరుగుతుందనే అనుమానంతో ఓ ముస్లిం మహిళను బుర్ఖా తీసి ఆమె ముఖాన్ని ఓటర్ స్లిప్‌లో ఉన్న ఫొటోతో సరిపోల్చి చూశారు. ఈ ఘటన వివాదస్పదంగా మారడంతో కన్నెర్రజేసిన ఈసీ.. ఆమెపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈసీ ఆదేశాలకు ఆమెపై మలక్ పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగానే.. హైదరాబాద్‌లో రిగ్గింగ్ జరిగిందని.. రీ పోలింగ్ నిర్వహించాలని మాధవీలత డిమాండ్ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆమె డిమాండ్‌పై ఈసీ ఏ విధంగా రియాక్ట్ అవుతుందనేది స్టేట్ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## రూ.34000 కోట్ల కుంభకోణం

### 17 బ్యాంకుల నుంచి పెద్దమొత్తంలో మోసం

### డిహెచ్ఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ అరెస్ట్

న్యూఢిల్లీ, మే 15 (ప్రభాత ఉదయం): దేశంలో బ్యాంకింగ్ మోసాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విజయ్ మాల్యా, నీరవ్ మోదీలు పెద్ద ఎత్తున బ్యాంకు మోసాలకు పాల్పడగా, వారిపై కేసు ఇంకా కొనసాగుతూనే ఉంది. వారు విదేశాల్లో తలదాచుకుని తప్పించుకుని ఉన్నారు. ఇప్పుడు మరో బ్యాంకు కుంభకోణం చోటు చేసుకుంది. 34000 కోట్ల బ్యాంకు మోసం కేసులో డిహెచ్ఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ ధీరజ్ వాధవాన్‌ను సిబిఐ అరెస్టు చేసింది. ధీరజ్ వాధవాన్‌ను అరెస్టు చేసిన తర్వాత, ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, కోర్టు అతన్ని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. వాధావన్ 17 రుణ బ్యాంకులతో ఈ మోసానికి పాల్పడ్డాడు. ఇది ఇప్పటివరకు దేశంలో అతిపెద్ద బ్యాంకింగ్ మోసం. 34,000 కోట్ల విలువైన 17 బ్యాంకుల కన్సార్టియం మోసానికి సంబంధించి సీబీఐ ఇప్పటికే కేసు నమోదు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ బ్యాంకుల కన్సార్టియంకు నాయకత్వం వహిస్తోంది. 2022లోనే బ్యాంకు మోసం కేసులో ధీరజ్ వాధావన్ పేరును సీబీఐ ఛార్జ్ షీట్‌లో చేర్చారు. అదే సమయంలో ఇది దేశ బ్యాంకింగ్ చరిత్రలో అతిపెద్ద మోసంగా పరిగణించబడుతుంది. ఇంతకు ముందు కూడా యెస్ బ్యాంక్ కుంభకోణం కేసులో ధీరజ్ వాధవాన్‌ను సీబీఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం అతను ఈ కేసులో బెయిల్‌పై ఉన్నాడు.డిహెచ్ఎఫ్ఎల్ సిఎండి కపిల్ వాధావన్, డైరెక్టర్ ధీరజ్ వాధావన్ సహా మొత్తం 74 మంది, 57 కంపెనీలపై సిబిఐ న్యూఢిల్లీలోని ప్రత్యేక కోర్టు ఆఫ్ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. 17 బ్యాంకుల్లో మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఈవో హర్షిల్ మెహతా పేరును కూడా చార్జ్ షీట్‌లో చేర్చారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిర్యాదుపై దాఖలు చేసిన కపిల్ వాధావన్, డైరెక్టర్‌గా ఉన్న ధీరజ్ వాధావన్, ఇతర నిందితులతో కలిసి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని 17 బ్యాంకులతో మోసం చేయడానికి కుట్ర పన్నారని పేర్కొంది. నేరపూరిత కుట్ర చేసి రూ.42,871.42 కోట్ల రుణం ఇవ్వాలని ఈ బ్యాంకులను కోరింది. భారీ మొత్తంలో రుణం తీసుకుని దుర్వినియోగం చేశారు. సీబీఐ ప్రకారం.. జూలై 31, 2020 నాటికి 17 బ్యాంకుల కన్సార్టియం బకాయిల కారణంగా రూ. 34615 కోట్ల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కారులో మంటలు చెలరేగి దంపతుల మృతి

ఖమ్మం, మే 15 (ప్రభాత ఉదయం): ఖమ్మం జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి చెందారు. కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టడంతో మంటలు చెలరేగాయి. అందులో ఉన్న వృద్ధ దంపతులు సూర్యనారాయణ, రుక్మిణి అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. బోనకల్ మండలం ముష్టికుంట్ల సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గాయాలతో అపస్మారక స్థితిలో యువకులిద్దరినీ ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వృద్ధ దంపతులు మామిళ్లగూడేనికి చెందినవారిగా గుర్తించారు.



## అంగన్‌వాడీ టీచర్ అనుమానాస్పద మృతి

ములుగు, మే 15 (ప్రభాత ఉదయం): అంగన్వాడీ ఉపాధ్యాయిని హత్యకు గురైన ఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సుజాత (48) మండలంలోని కాటాపురంలో అంగన్వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆమె విధులు ముగించుకుని తన స్వగ్రామమైన ఏటూరునాగారం బయలుదేరారు. బుధవారం ఉదయం తాడ్వాయి సమీపంలో అడవికి వెళ్లిన తునికాకు కూలీలకు సుజాత మఅతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న సీఐ శంకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మఅతురాలి మెడకు స్కార్ఫ్‌ను చుట్టి ఉరి వేసినట్లు గుర్తించారు. సుజాతకు చెందిన నాలుగు తులాల బంగారం, సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. దీనిపై విచారణ చేపట్టినట్లు చెప్పారు.

## ధాన్యం కొనుగోళ్లు జరక్క రైతుల ఆందోళన

యాదాద్రి భువనగిరి, మే 15 (ప్రభాత ఉదయం): ధాన్యం కొనుగోళ్లు జరగక రైతుల ఆందోళనలు పెరిగిపోతున్నాయి. ఆరుగాలం కష్టపడి, అప్పులు చేసి పంటలు పండిస్తే ప్రభుత్వం కోనుగోలు చేయకపోవడంతో రైతన్నలు ఆగ్రహం చెందారు. కండ్ల ముందే పంటలు పాడవుతున్నా పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన రైతులు కలెక్టరేట్ ఎదుట గిరిజన రైతుల ధర్నా చేపట్టారు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. జిల్లాలోని భువనగిరి మండలం పచ్చళ్లపాడు తండా గ్రామానికి చెందిన గిరిజన రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వడ్లు కొనకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ట్రయల్ రన్ విజయవంతం

మొదటి పేజీ తరువాయి...

ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్లాంట్‌లో యూనిట్ల నిర్మాణం ఏ స్థాయిలో ఉంది..బొగ్గు తరలించే రైల్వే ట్రాక్ నిర్మాణ పురోగతి, గతంలో జరిగిన పనుల బిల్లుల చెల్లింపులు, రానున్న కాలంలో జరగాల్సిన పనులు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై మంత్రులు సమీక్షించారు. ఇంకా ఎంత మందికి నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంది.. తదితర అంశాలతో ప్రపంచం మొత్తం హరిత విద్యుత్, పునరుత్పాదక ఇంధనం వైపు దూసుకుపోతుంటే గత పాలకులు థర్మల్ పవర్ పై దృష్టి సారించారు. వివిధ కారణాలతో జాప్యం చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం పడిందని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ప్లాంట్‌లో నైపుణ్యం, నైపుణ్యం ఉన్న వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## పోలింగ్ సరళి మాకే అనుకూలం

### 4న ఇండియా కూటమిదే అధికారం

### మీడియా సమావేశంలో మల్లికార్జున ఖర్గే



లక్నో, మే 15 (ప్రభాత ఉదయం): నాలుగు విడతల్లో జరిగిన పోలింగ్ తమకే అనుకూలంగా ఉందని, దేశ ప్రజలు మోదీకి వీడ్కోలు పలకాలని నిర్ణయించారని, ఓటు ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించారని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తోందని ధీమా వ్యక్తం చేశారు. లక్నోలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జూన్ 4న ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేవని అన్నారు. మన భవిష్యత్ తరాలు, వాళ హక్కులు, రిజర్వేషన్లను రక్షించడానికి ప్రజలు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై ఇండియా అలయన్స్ పోరాడుతోందని చెప్పారు. రాజ్యాంగాన్ని రక్షిస్తేనే ప్రజలకు హక్కులుంటాయని అన్నారు. ఓటు ఉంటే ఎవరినైనా ప్రజాస్వామ్యంలో ఎన్నుకోగలమని అన్నారు. నియంతృత్వం, నిరంకుశత్వం ఉంటే ప్రజాస్వామ్యం ఎలా మనుగడ సాగిస్తుందని అన్నారు. బీజేపీకి బలం ఉన్న చోట తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా ఆపి ఏజెంట్లను మభ్యపెడుతున్నారని అన్నారు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి బురఖాపై కన్నేశారని గుర్తు చేశారు. దేశానికి ఎన్నో ఇచ్చామని చెబుతూ బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని మార్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. 'గాంధీజీ స్వాతంత్ర్యం తెచ్చారు, నెహ్రూజీ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని సృష్టించారు.. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించారు..'అని అన్నారు. బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని మార్చాలని మాట్లాడుతున్నా మోదీ మౌనంగా కూర్చున్నారని, అలా మాట్లాడటం దేశద్రోహమని అనలేదని ఆరోపించారు.



## హైదరాబాద్ నెహ్రూ జూపార్క్‌లో అరుదైన తెల్లపులి మృతి

హైదరాబాద్, మే 15 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ నెహ్రూ జూ పార్క్‌లో మగ బెంగాల్ టైగర్ 'అభిమన్యు' మృత్యువాత పడింది. 9 ఏళ్ల కిందట జూ పార్క్ లోనే జన్మించిన అభిమన్యు అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందినట్లు జూ పార్క్ క్యూరేటర్ ప్రకటించారు. బెంగాల్ టైగర్ 'అభిమన్యు' అరుదైన తెల్లపులి. దీనికి గతేడాది ఏప్రిల్‌లో 'నెఫ్రిటీస్' అనే కిడ్నీ సంబంధమై వ్యాధి ఉన్నట్లు జూ అధికారులు గుర్తించారు. దీంతో ఆరోగ్యపరంగా బలహీనంగా ఉన్న అభిమన్యుకు అప్పటి నుంచి జూ వెటర్నరీ విభాగం అధికారులు అన్ని రకాల వైద్యసేవలు అందిస్తూ వచ్చారు. అయితే ఆరోగ్యం మరింత క్షీణించడంతో మే12 నుంచి అభిమన్యు ఆహారం తీసుకోవడం లేదు. రెండు కిడ్నీలు పూర్తిగా పాడైపోవడంతో మంగళవారం మృతి చెందింది. అభిమన్యు హైదరాబాద్‌లోని నెహ్రూ జువలాజికల్ పార్క్‌లో జనవరి 2, 2015న జన్మించింది. సురేఖ, సమీరా అనే పులులు దీనికి జన్మనిచ్చాయి. తెల్లని ఛాయలో పుట్టిన ఈ అరుదైన బెంగాల్ టైగర్ ఏడాది నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. జూలో ఎంత మంది నిపుణులు చికిత్స అందించినా పులి ఆరోగ్యం కుదుట పడలేదు. ఈ క్రమంలో మే 5వ తేదీ నుంచి నడవలేక ఉన్నచోటు నుంచి కదలలేకపోయింది. ఈ నెల 12 నుంచి రుమాటిజంతో బాధపడటం ప్రారంభించింది. దీంతో ఆహారం తీసుకోవడం పూర్తిగా మానేసింది. గత మూడు రోజులుగా జూలోనే మందులతో పాటు ద్రవ ఆహారం అందిస్తూ చికిత్స కొనసాగించినా.. దురదృష్టవశాత్తూ మే14వ తేదీన మధ్యాహ్నం 2:15 గంటల సమయంలో కన్నుమూసినట్లు జూ అధికారులు తెలిపారు.హైదరాబాద్‌లో వెటర్నరీ నిపుణుల సమక్షంలో పోస్ట్‌మార్టం నిర్వహించగా.. అభిమన్యు మరణానికి కిడ్నీ సమస్యలే కారణమని నిర్ధారించబడింది. జూలో వైల్డ్‌లైఫ్ హాస్పిటల్ %డ% రెస్క్యూ సెంటర్‌కి చెందిన అనుభవజ్ఞులైన వెటర్నరీ వైద్యులు, నిపుణులు ఉన్నప్పటికీ తెల్ల పులి అభిమన్యు జీవిత కాలాన్ని పొడిగించలేకపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఈ జూలో ప్రస్తుతం మొత్తం పులులు 18 ఉన్నాయి. అందులో తెల్లపులులు 8 ఉన్నాయి.

## కోవిడ్ వ్యాక్సిన్ తర్వాత శరీరం పనిచేయడం లేదు

### కోవిడ్ వ్యాక్సిన్‌పై మహిళ కేసు నమోదు




న్యూఢిల్లీ, మే 15 (ప్రభాత ఉదయం): ఆస్ట్రాజెనాకా వ్యాక్సిన్‌పై మరో మహిళ దావా వేసింది. క్లినికల్ ట్రయల్స్ సమయంలో ఇచ్చిన వ్యాక్సిన్ తనను పూర్తిగా వికలాంగురాలిగా మార్చిందని మహిళ చెప్పింది. ఇప్పుడు ఆమె శరీరం మునపటిలా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. సంస్థ వైద్యం అందించడం లేదని ఆరోపించింది. విశేషమేమిటంటే బ్రిటన్‌లో ఇప్పటికే 50 మందికి పైగా ఆస్ట్రాజెనెకాపై దావా వేశారు. 42 ఏళ్ల బ్రై డ్రెస్సెన్ అమెరికాలో ఆస్ట్రాజెనెకా కోవిడ్ వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్‌లో పాల్గొన్నారు. 2020 లో విచారణలో పాల్గొన్న తర్వాత.. అతను తీవ్రమైన నరాల సమస్యలను ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. ఈ బ్రిటిష్ వ్యాక్సిన్‌ను అమెరికాలో పరీక్షించారు. కానీ ఉపయోగం కోసం ఆమోదించబడలేదు. పరిశోధన ఫలితంగా తగిలిన గాయాల చికిత్సకు కంపెనీ చెల్లిస్తుందని వాగ్దానం చేసిన కంపెనీతో తాను ఒప్పందం కుదుర్చుకున్నానని డ్రెస్సెన్ పేర్కొన్నారు.నవంబర్ 2020 లో వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత.. ఆమె తన శరీరమంతా ముడతలు పడటం ప్రారంభించిందని మహిళ చెప్పింది. దీని తరువాత కూడా ఆస్ట్రాజెనెకా తన చికిత్స కోసం చేసిన ఖర్చులను చెల్లించలేదు. పెరిఫెరల్ న్యూరోపతితో బాధపడుతున్న తర్వాత తాను పని చేయలేకపోతున్నానని ఆమె వార్తాపత్రికతో చెప్పింది. "నేను వ్యాక్సిన్ కారణంగా నా ఉద్యోగాన్ని కోల్పోయాను. ఇప్పటికీ వైకల్యంతో ఉన్నాను" అని డ్రెస్సెన్ చెప్పారు. 'వారంలో ఏడు రోజులూ రోజుకు 24 గంటలూ తల నుంచి కాలి వరకు నా శరీరమంతా సూదులు గుచ్చినట్లు అనిపిస్తుంది' అని ఆమె చెప్పింది. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత తాను చాలాసార్లు ఆసుపత్రిలో చేరానని, దాని వల్ల బిల్లు వేల డాలర్లకు చేరుకుందని ఆమె చెప్పింది. మానసిక క్షోభ, ఆదాయ నష్టం, రవాణా, న్యాయపరమైన రుసుములను క్లెయిమ్ చేస్తోంది. మహిళ వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలు, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు.

## ఓటు బ్యాంక్ రాజకీయాలకు నేను దూరం

మొదటి పేజీ తరువాయి...

పండగలతో పాటు ఈద్ కూడా నిర్వహించేవాళ్లం. ఈద్ రోజున మా ఇంట్లో వంట చేసుకునేవాళ్లం కాదు. ఆ వర్గానికి చెందిన కుటుంబాలే మాకు ఆహారం తెచ్చిఇచ్చేవి. అలాగే మొహర్రంలోనూ భాగమయ్యేవాళ్లం. అలాంటి ప్రపంచంలో నేను పెరిగాను. నా స్నేహితుల్లో చాలా మంది ముస్లింలు ఉన్నారని వెల్లడించారు. అలాగే ఈ ఎన్నికల్లో ఆ వర్గం నుంచి ఓట్లు పడతాయా? అని ప్రశ్నించగా..ఈ దేశ ప్రజలు తనకు ఓటు వేస్తారని సమాధానం ఇచ్చారు. హిందూ-ముస్లిం అంటూ తేడా చూపడం ప్రారంభించిన రోజు.. ప్రజాజీవితంలో ఉండే అర్హత తనకు ఉండదన్నారు. అలాంటి తేడా ఎన్నటికీ చూపనంటూ ప్రతిజ్ఞ చేశారు. కొద్దిరోజుల క్రితం రాజస్థాన్‌లో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ మోదీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. 'ప్రజల వద్ద ఉన్న బంగారంతో సహా సంపద మొత్తం సర్వే చేసి అందరికీ సమానంగా 'పునఃపంపిణీ' చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో చెప్పింది. ఆ మేరకు దేశ సంపదనంతా చొరబాటుదారులకు, ఎక్కువమంది పిల్లలు ఉన్నవారికి పంచుతారు. మీ ఆస్తులను జప్తు చేసే అధికారం ప్రభుత్వాలకు ఉందా? అర్బన్ నక్సలిజం మనస్తత్వం ఉన్న ఆ పార్టీ నాయకులు మహిళల మంగళ సూత్రాలను కూడా వదలరు. మీ కష్టార్జితం చొరబాటుదారుల పాలవడం మీకు సమ్మతమేనా?' అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. దీనిపై ప్రధాని మోడీ వివర్శలకు వివరణ ఇచ్చారు.

# ఏఐటీయూసీ కార్మిక ఉద్యమ నేత ఎం బి కృష్ణయ్యకు ఘన నివాళులు

**కృష్ణయ్య సేవలు మరవలేనివి, నిరంతర పోరాట యోధుడి ఆశయాల్లో కొనసాగుదాం -ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు**



గద్వాల జిల్లా ప్రతినిధి, మే 15(ప్రభాత ఉదయం) ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్మికొద్యమానేత, నిరంతర పోరాట యోధుడు ఏఐటీయూసీ జిల్లా మాజీ అధ్యక్షులు ఎంబీ కృష్ణయ్య సేవలు మరువలేనివాని అయనపోరాట అడుగుజాడల్లో కార్మికులందరు నడువాలని ఏఐటీయూసీ గద్వాల జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం ఎంబీ కృష్ణయ్య నాలుగోవ వర్ధంతి సందర్బంగా జోగులాంబ గద్వాల ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్లకుంట కార్మికుల అడ్డాలో ఆర్టీసీ యూనియన్ బస్టాండ్ ముందు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్బంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కార్మికులకు ఏకష్టం వచ్చిన కృష్ణయ్య ముందుండి కొట్లాడేవారని ఆయన లేనిలోటు పూడ్చాలెమని ఆయన యెక్క ఆశయాల కోసం కార్మికులందరూ పోరాడినప్పుడే నిజమైన నివాళి ఇచ్చిన వారమౌతమని ఈసందర్బంగా కార్మికులకు సూచించారు, ఆయన నిర్మించిన కార్మిక సంఘాలను మరింత పటిష్టంగా చేసి పోరాడుదామని కార్మికులకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న, శంకర్, rtc ఎంప్లాయిస్ యూనియన్ గిరిరాజు, రాంనాథ్ హమాలీ యూనియన్ నాయకులు వెంకట్రాములు, రాజు,ట్రాన్స్ పోర్ట్ యూనియన్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు



# నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

రాజేంద్రనగర్, మే 15(ప్రభాత ఉదయం) నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలో గల వివేకానంద నగర్ విద్యుత్ లీడర్ పరిధిలో గురువారం ఉదయం ఎనిమిది గంటల నుండి 8:30 గంటల వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని నార్సింగి విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ రెడ్డి తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన వివేకానంద నగర్, క్యూబా మజీద్ కాలనీ, నార్సింగ్ హైట్స్, సత్యం సింగ్ లేఅవుట్, మార్వా టౌన్షిప్, కాష్వా కాలనీ, అల్కాపురి రోడ్ నెంబర్ 29 ,30, అపర్ణ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 8:30 గంటల నుండి 9 గంటల వరకు మూవీ టవర్స్, అపర్ణ ఆర్ఎంసి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని, నార్సింగి పోలీస్ స్టేషన్ విద్యుత్ ఫీడర్ , తర్వ్యశ్య ఫీడర్ , ఎన్సిసి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. గగన్ పహాడ్ సెక్షన్ పరిధిలో... గగన్ పహాడ్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో ఉదయం 6:30 నుండి 7:00 వరకు తమిళనాడు హోటల్, డైమండ్ వే బ్రిడ్జ్, బుద్వేల్ రైల్వే స్టేషన్, పరివార్ డభా , ఆర్ ఈ సి,ఆరంఘర్, పాశంబండ, ఆర్ జి కే, సుచింద్ర,ఏజీయల్, మంజీరా కండక్టర్ వీఎన్నార్ వెంచర్ ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుండి 8:30 గంటల వరకు విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. మైలార్ దేవుపల్లి సబ్స్టేషన్ పరిధిలో... ఉదయం 6 నుండి 6:30 గంటల వరకు పల్లె చెరువు పారిశ్రామిక వాడ, తమిళ బస్తి, అహమ్మద్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.



## 160 కిలోమీటర్ల వేగంతో కారు డ్రైవ్..

# లైవ్‌లో చూపిస్తూ ప్రమాదంలో నలుగురు మృతి

అహ్మదాబాద్, మే15(ప్రభాత ఉదయం) కారులో ప్రయాణించిన ఐదుగురు యువకులు సందడి చేశారు. వందకు పైగా వేగంతో కారు వెళ్లడాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో లైవ్‌లో చూపించారు. వరుసగా వాహనాలను డ్రైవర్ దాటి వెళ్లడంతో అతడ్ని మరింతగా ఎంకరేజ్ చేశారు. చివరకు ఆ కారు ప్రమాదంలో నలుగురు మరణించారు. అయితే అదృష్టవశాత్తు డ్రైవ్ చేసిన వ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. గుజరాత్‌లోని వాసద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మే 2న అర్ధరాత్రి తర్వాత 22 నుంచి 27 ఏళ్ల వయస్సున్న ఐదుగురు స్నేహితులు అహ్మదాబాద్ నుంచి ముంబైకి కారులో ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై కారు 140 నుంచి 160 కిలోమీటర్ల వేగంతో వెళ్లడాన్ని ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో చూపించి కేరింతలు కొట్టారు. కాగా, రోడ్డుపై వాహనాలను కారు డ్రైవర్ వేగంగా దాటడంతో స్నేహితులు అతడ్ని మరింతగా ఎంకరేజ్ చేశారు. అయితే ఒక వాహనాన్ని క్రాస్ చేసే క్రమంలో అదుపుతప్పిన ఆ కారు ఒక చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో ఐదుగురు స్నేహితుల్లో నలుగురు ఈ ప్రమాదంలో మరణించారు. మరోవైపు కారు డ్రైవ్ చేసిన ముస్తఫా అలియాస్ షహబాద్ ఖాన్ పఠాన్ గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కారు ప్రమాదంలో నలుగురి మృతికి ముందు ఇన్‌స్టాగ్రామ్ లైవ్ స్ట్రీమింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



# మారుతోన్న వాతావరణ పరిస్థితుల్లో సమతుల్య వ్యవసాయం ప్రాధాన్యత అవసరం

**డాక్టర్ ఎం.మల్లారెడ్డి**

రాజేంద్రనగర్, మే15(ప్రభాత ఉదయం) ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సమతుల్య వ్యవసాయం -సాంకేతికత అన్న అంశంపై ఉద్యాన రైతులకు వారం రోజుల శిక్షణా బుధవారం ప్రారంభమైంది. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహ సంచాలకులు డాక్టర్ ఎం.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మారుతోన్న వాతావరణ పరిస్థితుల్లో సమతుల్య వ్యవసాయం ప్రాధాన్యతలు సంతరించుకొందని మల్లారెడ్డి తెలిపారు. అనంతరం ఉద్యానశాఖ అధికారులు ఎ.ప్రేమ్ సింగ్,శేఖర్,నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం, సంచాలకులు డాక్టర్ అనిల్ కుమార్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ వారం రోజుల శిక్షణ కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. ఉద్యాన పంటలైన కూరగాయలు,పూల తోటల పెంపకంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గురించి వెల్లడించారు. అలాగే ఈ పంటలలో ఉన్న ఎగుమతి అవకాశాలను కూడా రైతులకు వివరించనున్నారు. నేషనల్ కమిటీ ఆన్ ప్రెసిషన్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ ఈ శిక్షణ కార్యక్రమానికి సహకారం అందించింది. వివిధ జిల్లాల ఆసక్తిగల యువ రైతులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.

## పార్లమెంట్ ఎన్నికలు..

# పౌరసత్వం ధ్రువీకరపత్రాల పంపిణీ

**ప్రారంభించిన కేంద్రం..!**




న్యూఢిల్లీ, మే 15 (ప్రభాత ఉదయం): సీఏఏ చట్టం అమలులోకి తీసుకుచ్చిన అనంతరం తొలిసారిగా కేంద్రం పలువురికి పౌరసత్వ ధ్రువీకరపత్రాలను పంపిణీ చేసింది. ఈ చట్టం కింద బుధవారం తొలిసారిగా ఢిల్లీలోని 14 మంది శరణార్థులకు పౌరసత్వ ధ్రువీకరణ పత్రాలను కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా అందజేశారు. దీంతో దేశవ్యాప్తంగా దాదాపు 31వేల మంది ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైంది. ఓ వైపు పార్లమెంట్ ఎన్నికల్లో సీఏఏ అంశంపై రాజకీయాలు వేడెక్కుతు న్నాయి. ప్రతిపక్ష కూటమిలోని పార్టీలు సీఏఏను వ్యతిరేకిస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే చట్టాన్ని రద్దు చేస్తామని చెబుతుండడం విశేషం. సీఏఏని వ్యతిరేకిస్తున్న పార్టీలను హిందూ వ్యతిరేక పార్టీలుగా బీజేపీ విమర్శిస్తున్నది. ముస్లిం సమాజాన్ని ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ధ్వజమెత్తింది. పౌరసత్వ సవరణ చట్టం ఈ ఏడాది మార్చి 11 నుంచి దేశంలో అమల్లోకి వచ్చింది. పౌరసత్వ సవరణ బిల్లు 2019 పార్లమెంట్ ఆమోదించిన అనంతరం ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. సీఏఏ చట్టం ద్వారా పాక్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి హిందు, సిక్కు, జైన్, బౌద్ధ, పార్సీ, క్రైస్తవ వర్గాలకు పౌరసత్వం కల్పించనున్నట్లు పేర్కొంది. 2014 డిసెంబర్ 31.. లేదా అంతకన్నా ముందు వచ్చిన ఆయా ముస్లిమేతరులకు పౌరసత్వం ఇవ్వనున్నది.



కేక్ కట్ చేస్తున్న సామ రాజపాల్ రెడ్డి

# సీనియర్ కాంగ్రెస్ నాయకులు సామ రాజ్ పాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

బుద్వేల్, మే15(ప్రభాత ఉదయం) : సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఉప్పర్ పల్లి వాస్తవ్యులు సామ రాజ్ పాల్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. రాజ్ పాల్ రెడ్డి చేత కాంగ్రెస్ నాయకులు ఆర్. దేవేందర్ గౌడ్ కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, హరేంద్ర, శ్రీనివాస్ రాజు, నరేంద్ర, నర్సింహ లు పాల్గొన్నారు.



# వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కారు మోసం

**రాష్ట్రవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చిన కేసీఆర్**

హైదరాబాద్, మే 15 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. సీఎం ప్రస్తుతం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించడం, మోసం చేయడమేనని.. దగా చేయడమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను గులాబీ బాస్ ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ““రాష్ట్రంలో 90శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. ఈ విషయం తెలిసి రాష్ట్ర ప్రభుత్వం ఇట్లా ఎట్లా ప్రకటిస్తది?’ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ద్వారా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వచించింది. ఓట్లు డబ్బాలో పడంగనే కాంగ్రెస్ వాళ్లకు రైతుల అవసరం తీరింది. అందుకే నాలిక మల్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పూనుకున్నారు. ఇదే సన్న వడ్లకు మాత్రమే అనే మాట ఎన్నికలకు ముందు గనుక చెప్పింటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కుతుక్కు చేసేవాళ్లు. ఇప్పటికీ ప్రజలు ఆగ్రహంతోనే ఉన్నారు. రైతుబంధు ఇయ్యక, రైతు భరోసా ఇయ్యకుండా రైతాంగాన్ని అన్నిరకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నది. అందు కారణంగానే రైతాంగ హక్కులను హామీలను సాధించేందుకే బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టింది’ కేసీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రైతులపక్షాన నిలబడి కొట్లాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో వడ్లను కొనడానికి నిర్లక్ష్యం వహిస్తూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడిపిస్తూ గోస పుచ్చుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతాంగానికి భరోసా కల్పించే దిశగా నిరసన కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ వడ్ల కల్లాలకాడికి బీఆర్ఎస్ శ్రేణులు వెళ్లాలని.. రైతులకు అండగా నిలవాలని బీఆర్ఎస్ అధినేత పిలుపునిచ్చారు. రైతుల హక్కులను కాపాడేందుకు వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని అధినేత కేసీఆర్ పునరుద్ఘటించారు.

# రాజకీయాలు పక్కనబెట్టి.. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయండి : కేటీఆర్



హైదరాబాద్, మే 15 (ప్రభాత ఉదయం): రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేయకుండా, అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలను పక్కనబెట్టి.. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం అనంతరం.. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలని.. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటాలుకు మూడు, మూడున్నర కిలోల తరుగు తీసేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. తరుగు విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏమేమీ మాట్లాడారో సామాజిక మాధ్యమాల్లో ఉన్నాయని అన్నారు. ఆనాడు వాళ్లు చెప్పిన దాని ప్రకారం.. ఎట్టిపరిస్థితుల్లో రైతుకు అన్యాయం చేయకుండా.. తరుగు లేకుండా ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు చేయడం లేదని కామారెడ్డి జిల్లా, నిర్మల్ జిల్లా లక్ష్మణ్‌చందాలో రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ధాన్యం బస్తాలతోనే నిరసన తెలిపారని తెలిపారు. వరంగల్ జాతీయరహదారిపై ధర్నా చేయడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేటలో వరిధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ధర్నా చేశారని చెప్పారు. కేవలం నాలుగు జిల్లాలల్లో మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల రైతులు గత 25, 30 రోజులుగా ధాన్యం తెచ్చిన తర్వాత కూడా కొనుగోలు చేయకుండా, అధికారులు పట్టించుకోకపోవడంతో దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలను పక్కనబెట్టి.. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా దాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తరుగు లేకుండా కొనుగోలు చేయాలని.. వెంటనే కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతన్నల తరఫున ప్రశ్నించడమే కాకుండా.. అవసరమైతే రోడ్డెక్కి.. పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని టీఆర్ హెచ్చరించారు. రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని.. మీ తరఫున కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ యంత్రాంగం మొత్తం ఉందని ధైర్యం చెప్పారు. రైతులు ఎప్పుడు పిలిచినా.. ఎక్కడికి పిలిచినా వస్తామని అన్నారు. రైతులకు న్యాయం జరిగేవరకు వాళ్ల తరఫున ఉంటామని తెలిపారు. రైతులకు రుణమాఫీ జరిగే వరకు, పంట బోనస్ వచ్చే వరకు, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే వరకు వదిలిపెట్టమని స్పష్టం చేశారు. ప్రజల తరఫున, రైతుల తరఫున నిలబడి మాట్లాడతామని తెలిపారు. ఎవరూ అధైర్యపడొద్దని, ఎవరూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని విజ్ఞప్తి చేశారు.

# రాజస్థాన్‌పై పంజాబ్ గెలుపు

## శామ్ కుర్రాన్ కెప్టెన్ ఇన్నింగ్స్

**5 వికెట్ల తేడాతో పంజాబ్ విజయం**


**వరుసగా 4వ మ్యాచ్‌లో ఓడిన రాజస్థాన్**

**ఐపీఎల్-2024 65వ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై పంజాబ్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సీజన్‌లో 5వ మ్యాచ్‌లో పంజాబ్ విజయం సాధించింది. జట్టు 10 పాయింట్లు సాధించింది. మరోవైపు ప్లేఆఫ్స్‌కు చేరిన రాజస్థాన్ వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ ఓడిపోయింది. రాజస్థాన్ తమ రెండో హెూం గ్రౌండ్ గౌహతిలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 144 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో పంజాబ్ 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.**





ఐపీఎల్-2024 సీజన్ లో భాగంగా బుధవారం గువాహటిలో జరిగిన 65వ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్టుపై పంజాబ్ కింగ్స్ ఎలెవెన్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ విధించిన 145 పరుగుల విజయ లక్ష్యాన్ని ఏడు బంతులు మిగిలి ఉండగానే ఐదు వికెట్లు కోల్పోయి పంజాబ్ విజయాన్ని సొంతం చేసుకున్నది. పంజాబ్ కింగ్స్ సారధి శామ్ కుర్రాన్ 63 పరుగులతో నాటౌట్ గా నిలవగా, రీలీ రొస్కో 22, జితేశ్ శర్మ 22 పరుగులు చేశారు. చివరగా అశుతోష్ శర్మ 17 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ ఒకటి, అవేష్ ఖాన్, యుజువేంద్ర చాహల్ చెరో రెండు వికెట్లు తీశారు. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ 48, రవిచంద్రన్ అశ్విన్ 28 పరుగులు మినహా మిగతా బ్యాటర్లు పెద్దగా ఆకట్టుకోలేక పోయారు. పంజాబ్ బౌలర్లలో శామ్ కురాన్, హర్షల్ పటేల్, రాహుల్ చాహల్ చెరో రెండు వికెట్లు, అర్షదీప్ సింగ్, నాథన్ ఎల్లిస్ చెరో వికెట్ తీశారు.



## టీమ్ఇండియా కొత్త కోచ్ రేసులో స్టీఫెన్ ఫ్లెమింగ్

టీమ్ ఇండియా కొత్త కోచ్ వేటలో బీసీసీఐ పడింది. ఆ బాధ్యతల్లో ఉన్న రాహుల్ ద్రవిడ్ ఇకముందు కొనసాగేందుకు ఇష్టం చూపడం లేదు. ఎన్‌సీఏ డైరెక్టర్ హెూదాలో పనిచేస్తున్న వీవీఎస్ లక్ష్మణ్ పేరు కూడా ఈ రేసులో ఉంది. మరోవైపు విదేశీ కోచ్‌లను నియమించుకునే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు ఇటీవల బీసీసీఐ వెల్లడించిన నేపథ్యంలో సీఎస్కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ పేరు బలంగా వినిపిస్తోంది. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ అయిన స్టీఫెన్ ఫ్లెమింగ్ ఐపీఎల్‌లో చెన్నై జట్టు కోచ్‌గా అద్భుతంగా నడిపిస్తున్నాడు. అతడి హయాంలోనే సీఎస్కే ఐదుసార్లు ట్రోఫీ గెలిచి ముంబయి రికార్డును సమం చేసింది. టీమ్ఇండియా కొత్త కోచ్ రేసులో అతడి పేరు వినిపిస్తుండటంపై సీఎస్కే స్పందించింది. అలాంటి ప్రతిపాదనలను చెన్నై సీఈవో కాశీ విశ్వనాథన్ కొట్టిపారేశారు. దీనిపై తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. "అలాంటి వార్తాలు నేను వినలేదు. ఫ్లెమింగ్‌కు, జట్టుకు దీనిపై ఎలాంటి సమాచారం లేదు" అని తెలిపాడు. టీమ్ఇండియా కొత్త కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్ అర్హతలు, నైపుణ్యాలు సరిగ్గా సరిపోతాయని బీసీసీఐ భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. కుర్రాళ్లను ప్రోత్సహించి.. వారిలోని ప్రతిభను వెలికితీయడంలో ముందుంటాడని పలువురు అంటున్నారు. సీఎస్కేలో ఎంతోమందిని ఇలాగే పైకి తీసుకువచ్చాడని చెబుతున్నారు. ఫ్లెమింగ్‌తోపాటు.. ఈ రేసులో ఉన్న విదేశీయుల జాబితాలో రికీ పాంటింగ్, జస్టిన్ లాంగర్ ఉన్నారు.

## సర్వీస్ గన్‌తో కాల్చుకున్న సచిన్ టెండూల్కర్ సెక్యూర్టీ గార్డు

మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌కు భద్రత కల్పిస్తున్న దళంలోని స్టేట్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ జవాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జామ్నేర్ పట్టణంలోని తన స్వంత ఇంట్లో అతను కాల్చుకున్నట్లు తెలుస్తోంది. బలవన్మరణానికి పాల్పడిన ఆ పోలీసును ప్రకాశ్ కాప్డేగా గుర్తించారు. తన పూర్వీకుల గ్రామానికి వెళ్లేందుకు అతను కొన్ని రోజుల నుంచి లీవ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. సర్వీస్ గన్‌తోనే తన మెడలో కాల్చుకున్నాడు. అతని వెంట వయసు మళ్లిన పేరెంట్స్ ఉన్నారు. భార్య, ఇద్దరు పిల్లలు, ఓ సోదరుడు కూడా ఉన్నారు. బుధవారం రాత్రి 1.30 నిమిషాలకు అతను ఆత్మహత్య చేసుకున్నట్లు జామ్నేర్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ షిండే తెలిపారు. సూసైడ్ వెనుక ఉన్నకారణాలను కనుగునేందుకు పోలీసులు విచారణ చేపడుతున్నారు. వ్యక్తిగత కారణాల వల్ల ఆ జవాన్ బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణ ద్వారా గుర్తించారు. కాప్డే మృతదేహానికి అటాప్సీ చేస్తున్నారు. వీవీఐపీకి సెక్యూర్టీ కల్పిస్తున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం వల్ల ఎస్ఆర్పీఎఫ్ వ్యక్తిగతంగా ఈ కేసును దర్యాప్తు చేయనున్నది.

## ఫ్రీజింగ్ ఎగ్స్‌పై తప్పుడు వార్తలు

**అసమనం వ్యక్తం చేసిన నటి మెహరీన్**

తన వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని నటి మెహరీన్ పిర్జాదా మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా వారు బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోరారు. ఇటీవల ఆమె 'ఎగ్ ఫ్రీజింగ్' గురించి వివరిస్తూ ఓ పోస్ట్ పెట్టారు. దానిపై కొన్ని మీడియా సంస్థలు తప్పుడు వార్తలు రాశాయి. తాజాగా ఈ విషయంపై స్పందించిన మెహరీన్.. అసహనం వ్యక్తం చేశారు. 'కొన్ని మీడియా సంస్థల్లో పనిచేసే వారు వారి వృత్తిని గౌరవించాల్సిన అవసరం ఉంది. అర్థం చేసుకుని వార్తలను ప్రచురించండి. తప్పుడు సమాచారాన్ని ప్రజలకు అందించడం అనైతికమే కాదు.. చట్ట విరుద్ధం. ఇటీవల నేను పెట్టిన 'ఫ్రీజింగ్ ఎగ్స్' పోస్ట్‌పై కొందరు రకరకాల వార్తలు రాశారు. నేను ధైర్యం చేసి ఈ విషయం గురించి మాట్లాడాను. ఫ్రీజింగ్ ఎగ్స్ కోసం అమ్మాయిలు గర్భవతులు కావాల్సిన అవసరం లేదు. బాధ్యతయుతమైన సెలబ్రిటీగా కొందరికి దీని గురించి అవగాహన కల్పించడం కోసం పోస్ట్ పెట్టాను. పిల్లలు అప్పుడే వద్దని భావించే తల్లి దండ్రులకు ఎగ్ ఫ్రీజింగ్ పద్ధతి ఉపయోగపడుతుంది. దీని గురించి తెలియకుండా మీ స్వార్థం కోసం తప్పుడు కథనాలు రాశారు. నేను ప్రెగ్నెంట్ అని ప్రచారం చేశారు. ఇప్పటికైనా ఇలాంటి వార్తలకు ఫుల్‌స్టాప్ పెట్టకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నాపై పెట్టిన పోస్ట్‌లను తొలగించండి. బహిరంగ క్షమాపణలు చెప్పండి' అని మెహరీన్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. నెటిజన్లు ఆమెకు సపోర్ట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు.




## కల్కి మ్యూజిక్ డైరెక్టర్‌కు బర్త్‌డే విషెస్

టాలీవుడ్ మూవీ లవర్స్ ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా సినిమాల్లో ఒకటి గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ తో తెరకెక్కిస్తున్న చిత్రం కల్కి 2898 ఏడీ . సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రాన్ని టాప్ బ్యానర్ వైజయంతీ మూవీస్ తెరకెక్కిస్తోంది. మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నుంచి మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన టైటిల్, గ్లింప్స్ వీడియో, టీజర్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ.. టాక్ ఆఫ్ ది గ్లోబల్ ఇండస్ట్రీగ్రా మారాయి. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని తెలిసిందే. ఇవాళ పుట్టినరోజు జరుపుకుంటున్న సంతోష్ నారాయణన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు మేకర్స్. మా సంగీత తాంత్రికుడు సంతోష్ నారాయణన్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు. అతి త్వరలో ఆయన సంగీత ప్రపంచాన్ని ఆస్వాదించే వరకు వేచి ఉండలేకపోతున్నాం.. అంటూ ట్వీట్ చేశారు మేకర్స్. కల్కి 2898 ఏడీ చిత్రాన్ని జూన్ 27న విడుదల చేస్తున్నారని తెలిసిందే. ఈ మూవీలో బాలీవుడ్ లెజెండరీ యాక్టర్ అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో నటిస్తుండగా.. బీటౌన్ భామలు దీపికా పదుకొనే, దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన కల్కి 2898 ఏడీ రైడర్స్ కాస్ట్యూమ్స్ మేకింగ్, అసెంబ్లింగ్ వీడియో నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. నాగ్ అశ్విన్ అండ్ ప్రభాస్ టీం రీసెంట్‌గా ఇటలీలోని సర్దినియా ఐలాండ్‌లో ప్రభాస్, దిశాపటానీపై వచ్చే సూపర్ స్టైలిష్ పాటను చిత్రీకరించారని తెలిసిందే.




## తారక్ పుట్టిన రోజు కానుక

### 20న దేవర ఫస్ట్ సింగిల్ లాంచ్




టాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్టులలో 'దేవర'ఒకటి. స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా వస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తొలిభాగం 2024 అక్టోబర్ 10న విడుదల కానుంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే మే 20న తారక్ పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ లాంఛ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించి అప్‌డేట్ ఇచ్చింది టీ సిరీస్ సౌత్. ఎన్టీఆర్ పుట్టిన రోజున దేవర సినిమా నుంచి మొదటి పాట వస్తుందని అభిమానులు అంతా ఫిక్స్ అయిన విషయం తెలిసిందే. అయితే హోప్స్‌కి మరింత మసాలా యాడ్ చేస్తూ.. తాజాగా సాలిడ్ పోస్ట్ పెట్టింది టీ సిరీస్ సౌత్. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను త్వరలోనే అనౌన్స్ చేయనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా వస్తున్న అంటూ దేవర డైలాగ్‌ను పోస్ట్ చేసింది. దీంతో తారక్ బర్త్ డే రోజు ఫస్ట్ సింగిల్ రానున్నట్లు తెలుస్తుంది. ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్, టామ్ ÷న్ చాకో, నరైన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె నిర్మిస్తున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.